క్లుప్తంగా

పీఎఫ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసనలో పాల్గొన్న చిట్టివలస ప్రాంత పెన్షనర్లు

తగరపువలస: తమ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని చిట్టివలస ప్రాంత పెన్షనర్లు పేర్కొన్నారు. సరైన పద్ధతిలో పెన్షనర్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టని కారణంగా గురువారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలలో భాగంగా నగరంలోని మద్రిపాలెం పీఎఫ్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనల్లో చిట్టివలస ప్రాంత ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు. దేశమంతా ఒకటే పెన్షన్ విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. విరమణ కాలానికి కనీస పెన్షన్ రూ.9000కు కరువు భత్యం కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, సింగిడి అప్పారావు, దామోదర బాబాజీ, పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

6న సీతారాముల కల్యాణం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారిజ ఆశ్రమం, శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో 6వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. ఆరోజు కల్యాణ మహోత్సవం అనంతరం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శ్మశానవాటికలో బోరుబావికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వ్యాపారవేత్త తాతాజీ

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటికలో బోరు బావి నిర్మాణానికి గురువారం భూమిపూజ జరిగింది. చిట్టివలస ప్రగతి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వ్యాపారవేత్త ఉప్పల తాతాజీ ఆర్థిక సాయంతో ఈ బోరుబావి నిర్మించనున్నారు. కార్యక్రమంలో రంగూరి సీతారామదొర, పిట్ట సురేష్, ఎర్నింటి వెంకటరమణ, తాటిపూడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్లు ఢీ .. ఇద్దరికి గాయాలు



నుజ్జయిన కార్ల ముందు భాగాలు

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లో గురువారం రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయని పద్మనాభం పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. విశాఖపట్నం నుంచి పద్మనాభం వైపు వెళ్తున్న కారు, విజయనగరం నుంచి సింహాచలం వైపు వెళ్తున్న కారు మార్గమధ్యలో మద్ది జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో విశాఖపట్నం నుంచి వస్తున్న కారులో ఉన్న ములకాల రాజేష్, విజయనగరం నుంచి వస్తున్న కారులో ఉన్న చలవా లక్ష్మి ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రెండు కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు అగ్ని ప్రమాదాలు



కోళ్లఫారాల వద్ద మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలంలో గురువారం సాయంత్రం రెండు వేర్వేరు చోట్ల జరిగిన అగ్ని ప్రమాదాలలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఆనందపురం పంచాయతీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో కోళ్ల ఫారాలకు చెందిన 9 పాకలు కాలిపోయాయి. ఆ సమయంలో ఇందులో కోళ్లు లేవు. ఇక్కడ నష్టం రూ.1.50 లక్షలు ఉంటుందని అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు తెలిపారు. కుసులవాడ పంచాయతీలో నీలగిరి తోటలకు నిప్పు అంటుకోగా స్వల్ప ప్రమాదం జరిగింది. ఇక్కడ పెద్దగా నష్టం లేదని తెలియజేశారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ



మధురవాడకు చెందిన మహిళకు టిడ్కో గృహ సముదాయంలో ఇల్లు మంజూరైంది. ఇంటి ఖరీదు రూ.6 లక్షల 90 వేలు. అందులో సగం కట్టమని చెప్పడంతో సొంత గూడు వస్తుందన్న ఆశతో బంగారం తాకట్టు పెట్టి రూ.3 లక్షల 45వేలు కట్టారు. ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ ఇల్లు ఇవ్వలేదు. పైగా 60 సంవత్సరాలు పైబడిన కారణంగా బ్యాంక్ వారు రుణం ఇవ్వబోమని చెప్పేశారు. దీంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జూన్‌లో ఇల్లు ఇస్తామని మెసేజ్ వచ్చిందని చెబుతున్నారు. దీంతో ఆమె నిరీక్షిస్తూనే ఉన్నారు.

ఇలా.. ఇళ్ల కోసం నిరీక్షిస్తున్న వారు నియోజకవర్గ పరిధిలోనే వెయ్యి మందికి పైగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన ఇళ్లు తప్ప భీమిలి నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఒక్క ఇటుక తీసి పెట్టడానికి కూడా నిధులు ఇవ్వలేదు. దీంతో అటు అద్దెలు కట్టలేక, ఇటు ఇళ్లు రాక లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టిడ్కో హౌసింగ్ కాలనీ

మండలాలు : భీమిలి, విశాఖ రూరల్ మండలం

మొత్తం ఇళ్లు : 1440

పూర్తయినవి : 240

అసంపూర్తిగా ఉన్నవి : 1200

నిర్మాణ వ్యయం : 98.17 కోట్లు

బకాయిలు : రూ. 58.84 కోట్లు

ఇళ్ల వివరాలు

నిర్మాణ ప్రాంతం	ఇళ్ల సంఖ్య	బ్లాకులు	ఎస్టిమేషన్	బకాయిలు (రూ.కోట్లలో)
సుద్దగెడ్డ	240	7	నిర్మాణం పూర్తయింది.	
బక్కన్నపాలెం	480	10	33.27	24.55
కొమ్మాది	336	8	29.9	3.29
సంగివలస	480	10	35.00	31.00
మొత్తం	1440	35	98.17	58.84

టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు

మధ్యలోనే నిలిచిపోయిన మూడొంతుల ఇళ్లు

బిల్లులు అందక ఆపేసిన కాంట్రాక్టర్లు

కూటమి పాలనలో పడకేసిన హౌసింగ్



కొమ్మాదిలో గత ప్రభుత్వ హయాంలోనే 70శాతం పూర్తయిన ఇళ్లు



మౌలిక సదుపాయాలు కల్పించని ఇళ్లు

మధురవాడ: హుద్‌హుద్ తుపాను అనంతరం పెను గాలులను సైతం అంటే సుమారు 100కిలో మీటర్లు పైబడి వచ్చిన గాలులను కూడా తట్టుకునే విధంగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా భీమిలి నియోజకవర్గంలో విశాఖ రూరల్ మండలం సుద్దగెడ్డ, బక్కన్నపాలెం, కొమ్మాది, భీమిలి మండలం సంగివలసల్లో సుమారు రూ.98.17కోట్లతో 1440ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 430, 365 ఎస్ఎఫ్‌టీల విస్తీర్ణంలో నిర్మాణం చేశారు. వీటి నిర్మాణం కోసం 2014లో ఉన్న టీడీపీ ప్రభుత్వం అధిక ధరలు వసూలు చేసింది. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నామమాత్రపు ధరలకే వీటిని అందించే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా సుద్ద గెడ్డ కాలనీలో 240ఇళ్లు నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసింది.

80శాతం పూర్తయినా..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వీటి నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం దాదాపు 80శాతం నిర్మాణ పనులు పూర్తయిన కొమ్మాది లాంటి ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి కూడా లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టలేదు. నిర్మాణాలు పూర్తయిన వాటికి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. మరో విచిత్రం ఏమిటంటే 60ఏళ్లు దాటిన వారికి ఇళ్ల కోసం కొందరి వద్ద డబ్బులు డీడీ ద్వారా 30వేలు కట్టించుకుని ఇళ్లు కేటాయించలేదు.

ఇల్లు ఇవ్వకుండా వాయిదాలు కట్టమంటున్నారు

టిడ్కో ఇంటి కోసం రూ.30వేలు డీడీ కట్టాను. సొంతిల్లు వస్తుందనే ఆశతో ఎన్నో ఇబ్బందులు పడి డబ్బులు కట్టాను. ఇప్పటికీ ఇల్లు ఇవ్వలేదు. బ్యాంకు వాయిదాలు మాత్రం కట్టేయమంటున్నారు. ఇల్లు ఇవ్వకుండా బ్యాంకు వాయిదాలు కట్టమంటే ఎలా కడతాం? ఇళ్ల అద్దెలు కట్టుకుంటూ, బ్యాంకు వాయిదా కట్టమంటే మాలాంటి వారికి ఎలా వీలవుతుంది?

– రత్న, లబ్ధిదారు, పీఎం పాలెం

ఏ సదుపాయాలు లేవు

మాది గోపాలపట్నం. మాకు ఇల్లు కేటాయించారు. పనులు పూర్తి కాని కారణంగా అప్పగించలేదు. కానీ, తప్పని పరిస్థితుల్లో ఇక్కడే ఉంటున్నాం. కనీసం నీరు, మరుగుదొడ్లు, రోడ్డు, లైటింగ్ వంటివి కూడా లేవు. ఏ అవకాశం లేక అద్దెలు కట్టుకోలేక అవస్థలు పడుతూనే ఉంటున్నాం.

–పిళ్ల ధనలక్ష్మి, కొమ్మాది

బిల్లుల పెండింగ్ వల్లే..

ఎల్ అండ్ టీకి భీమిలి నియోజకవర్గంలోని వివిధ చోట్ల బిల్లులతో పాటు పెందుర్తి సమీపంలోని చీమలాపల్లికి సంబంధించి సుమారు రూ.45కోట్ల మేర బిల్లు బకాయిలు ఉన్నాయి. కొమ్మాదిలో ఇంకా సదుపాయాలు, ఇతర 20శాతం పనులే ఉన్నాయి. కొమ్మాది, సంగివలసల్లో కూడా బిల్లులు పెండింగ్ కారణంగానే కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

– బండారు ఉమామహేశ్వరి, డీఈ, టిడ్కో, విశాఖపట్నం

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు

పద్మనాభం: బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఈ ఇంటర్వ్యూలకు రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న 366 మంది ఉదయం 10 గంటల హాజరు కావాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పెట్టుకున్న మూడు సెట్ల దరఖాస్తు, కులం, ఆదాయం, రేషన్, ఆధార్ కార్డుల జిరాక్సులు తీసుకురావాలని కోరారు.

భీమిలిలో ..

భీమునిపట్నం: భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం పది గంటలకు బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమంతరావు గురువారం తెలిపారు. పలు యూనిట్‌లకు బ్యాంక్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు రావలసి ఉంటుందన్నారు. ఇప్పటికే భీమిలి మండల పరిధిలోని 16గ్రామ పంచాయతీల నుంచి 489మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంటర్వ్యూల్లో బీసీ కార్పొరేషన్ అధికారులు, బ్యాంకుల మేనేజర్లు, మండల పరిషత్ అధికారులు పాల్గొంటారన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు అన్ని ధ్రువపత్రాల ఒరిజినల్స్, మూడు సెట్ల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

కళ్లివానిపాలెంలో చెరువు కనుమరుగు

- రాత్రివేళల్లో గ్రావెల్, మట్టితో నింపేస్తున్న వైనం
- గ్రామానికి ముంపు ముప్పు
- స్థానికుల్లో ఆందోళన



ఆక్రమణకు గురైన చెరువు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో ఆక్రమణల పర్వం తారస్థాయికి చేరుతోంది. ప్రభుత్వ స్థలాలు, కొండలు, గెడ్డలు ఆక్రమించిందే కాక ఇప్పుడు చెరువును సైతం ఆక్రమించేస్తున్నారు. కాపులుప్పాడ పరిధి కళ్లివానిపాలెంలో సర్వే నెంబర్ 149లో రెండెకరాల కోనేరు చెరువు ఆక్రమణకు గురవుతోంది. రాత్రి సమయాల్లో స్థానిక నాయకుల సహాయంతో కొందరు వ్యక్తులు గ్రావెల్, రాయి, మట్టి వంటివి నింపుతున్నారు. ఇప్పటికే ఈ రెండు ఎకరాల్లో కొంత భాగం కమ్మల పాకలు వేసి ఆక్రమించగా, మిగిలిన భాగాన్ని మట్టితో నింపేస్తున్నారు. వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు ఆ నీరంతా ఈ చెరువులోకే చేరుకునేదని, దీనివల్ల ఊరికి ఇబ్బంది ఉండేది కాదని స్థానికులు తెలిపారు. ఇప్పుడు చెరువు ఆక్రమణకు గురవుతోందని, దీనిని పరిరక్షించకుంటే భవిష్యత్తులో పెనుప్రమాదం తప్పదని ఇక్కడివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా..

ఈ చెరువు కబ్జాపై కాపులుప్పాడ సచివాలయంలో సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెరువును పరిరక్షించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కళ్లివానిపాలెం కోనేరు చెరువు ఆక్రమణకు గురి కాకుండా తక్షణ చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువులను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారు ఎంతటి వారైనా క్షమించేది లేదు.

– మల్లేశ్వరరావు, ఆర్ఐ, భీమిలి

బాలికల వసతిగృహం పునః ప్రారంభం

దివీస్ సహకారంతో పునర్నిర్మాణం



వసతి గృహాన్ని పునఃప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తగరపువలస: చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం పునః ప్రారంభించారు. ఇటీవల వసతిగృహం పూర్తిగా శిథిలం కావడంతో భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.82.90 లక్షలతో పునర్ నిర్మించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల భీమిలిలో శిథిలమైన వసతిగృహాలను కూడా దివీస్ అత్యాధునిక హంగులతో పునర్నిర్మించినట్టు గుర్తు చేశారు. సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు చిట్టివలస సహా భీమిలిలో ఆరు వసతి గృహాలను పునర్నిర్మించామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, స్థానిక వార్డెన్ జి.రమాదేవి, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సంస్థ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, వరహాల రెడ్డి, పి.శేఖర్‌బాబు, కె.నరసింహ, డి.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

హాక్‌థాన్‌లో ద్వితీయస్థానం కైవసం



అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ హాక్‌థాన్‌లో పాల్గొన్న ఆనందపురం కేజీబీవీ విద్యార్థులు

తగరపువలస: రాష్ట్రస్థాయి కంప్యూటర్ కోడింగ్ నైపుణ్యాలు నేర్పించే అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ హాక్‌థాన్‌లో ఆనందపురం కేజీబీవీకి చెందిన 8వ తరగతి విద్యార్థినులు ఎల్.శకుంతల, బి.అలేఖ్య, ఎల్.శశికళ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి గెలుచుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాల నుంచి 27 మంది విద్యార్థినులు పాల్గొనగా, అందులో ఈ కేజీబీవీ నుంచి ముగ్గురు ఉన్నారు. ఈ విద్యార్థులకు గత నవంబరు నుంచి కేజీబీవీలో హాక్‌థాన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. వేస్ట్ టు హెల్త్ ప్రాజెక్టులో రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి గెలుచుకున్న వీరిని అభినందిస్తూ విద్యాలయానికి ఒక టీవీ, రెండు లాప్‌టాప్‌లు, రెండు టాబ్‌లు, నాలుగు సర్టిఫికెట్లు, షీల్డు అందించారు. విద్యార్థులను సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ జోగ చంద్రశేఖరరావు, జీసీడీవో ఖలేషా బేగం తదితరులు అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వలందపేటలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: జీవీఎంసీ 1,2 వార్డులలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా రూ.12.58 లక్షలతో ఒకటోవార్డు చిట్టివలస గణేష్ థియేటర్ నుంచి సంతపేట వార్డు సచివాలయం మీదుగా కృష్ణా జూనియర్ కళాశాల కల్వర్టు వరకు రోడ్డు పునర్నిర్మాణం, రూ.17.49 లక్షలతో బంగ్లామెట్ట అంగన్‌వాడీ ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. రూ.1.05 కోట్లతో 2వ వార్డులో సంగివలస జాతీయ రహదారి నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రహదారి విస్తరణ, అలాగే వలందపేటలో జాతీయ రహదారి రామాలయం వరకు రోడ్డు పునర్నిర్మాణం చేపట్టనున్నారు. రూ.19 లక్షలతో అనిట్స్ కళాశాల డబుల్ రోడ్డు, రూ.28.20 లక్షలతో ఇడదాసరిపేట వరకు బీటీరోడ్డు నిర్మాణం, రూ.18.65 లక్షలతో గొల్లవీధి నుంచి సబ్బివానిపేట వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. జీవీఎంసీ పరిధిలో వార్డులను రూ.108 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం సాయి రమేష్

పద్మనాభం: స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపకల్పన చేయనున్నట్టు వెలుగు ఏపీఎం సాయి రమేష్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి కల్పించేందుకు చేపట్టాల్సిన సర్వేపై ఎన్యూమరేటర్లకు వెలుగు కార్యాలయంలో నాలుగు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయి రమేష్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలి, దీనికి ఎంత మొత్తం డబ్బులు అవసరం సర్వే చేయాలన్నారు. సంఘ సభ్యులు సీఐఎస్ఎఫ్, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజి కింద తీసుకున్న రుణాలు ఏ కార్యక్రమాలకు ఉపయోగించారు, ఎంత సంపాదించారు అనే విషయాలపై సర్వే చేపట్టాలన్నారు. ఈ సర్వే ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభించాలన్నారు. సర్వే అనంతరం సంఘ సభ్యులకు ఆర్థికపరంగా సహాయం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఏజీఎం సునీత, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

వృత్తినైపుణ్యానికి శిక్షణ దోహదం



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

మధురవాడ: విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెరగడానికి, మంచి భవిష్యత్తుకు అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీరింగ్ కోర్సు దోహదం చేస్తుందని అమెజాన్ ప్రతినిధి మధు సుంకపాటి తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్, అమెజాన్ లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కోర్సుకు సంబంధించి చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి ఈ ఆన్‌లైన్ కోర్సులో రిజిస్టర్ అయ్యి, పూర్తి చేయాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారికి ప్రతి జిల్లా నుంచి ల్యాప్‌టాప్‌లు, ఆండ్రాయిడ్ టీవీలు, ట్యాబ్స్ ప్రోత్సాహక బహుమతులుగా అందజేస్తామన్నారు. భవిష్యత్‌లో బోధన, అభ్యసన అవసరాలు తీర్చే విధంగా ఈ కోర్సును రూపొందించడం జరిగిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి మాట్లాడుతూ తాను ఈ కోర్సులో మొదటి భాగం పూర్తి చేశానని, కంప్యూటర్ కోడింగ్, స్క్రాచ్, ఈ-కంటెంట్ తయారీ తదితర అంశాలపై ఉపాధ్యాయులు మంచి నైపుణ్యం సంపాదించవచ్చునన్నారు. కార్యక్రమంలో అమెజాన్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ తుషార్ కుమార్ ఝా, కమ్యూనికేషన్స్ టీం లీడర్ ఆశిమా తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే సుఖ ప్రసవం



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న స్త్రీ వైద్య నిపుణురాలు విజయశ్రీ

భీమునిపట్నం: గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందుల్లేకుండా ప్రసవాలు జరుగుతాయని స్త్రీ వైద్య నిపుణురాలు పి.విజయశ్రీ అన్నారు. భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సీహెచ్‌సీలో నిరంతరం పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందిస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంతో ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో పౌష్టిక విలువలతో కూడిన ఆహారాలు ఎన్నో ఉన్నాయని తెలియజేస్తూ, వాటి గురించి వివరించారు. ప్రసవాల విషయంలో ఇక్కడ అవసరమైన అన్ని ఆధునిక సదుపాయాలు ఉన్నాయని, ఎవరూ అపోహ పడకుండా ఇక్కడికి వచ్చి ప్రసవాలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యులు ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలోనే పడిగాపులు

గిడిజాల కూడలిలో బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు



బస్సు షెల్టర్లు లేని గిడిజాల కూడలి

తగరపువలస: ఆనందపురం మండలంలో నిత్యం రద్దీగా ఉండే గిడిజాల కూడలిలో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలో ఇబ్బంది పడుతున్నారు. నీళ్ల కుండీల కూడలి నుంచి పద్మనాభం మీదుగా సింహాచలం, విజయనగరం ప్రాంతాలతో పాటు గిడిజాల మీదుగా భీమన్నదొరపాలెం, రామవరం, కణమాం, విజయనగరం జిల్లా కొత్తవలసకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో పలు విద్యాసంస్థలు, చిన్న తరహా పరిశ్రమలు, ఐటీబీపీ వంటి సంస్థలు కూడా ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు వివిధ వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో చాలామంది గిడిజాల కూడలి వద్ద వాహనాలు మారుతుంటారు. కానీ ఈ ప్రాంతంలో ప్రయాణికులు తలదాచుకోవడానికి నిలువ నీడ లేకుండా పోయిందని వాపోతున్నారు. దీంతో వర్షం వస్తే అందుబాటులో ఉన్న దుకాణాల వద్ద, ఎండ సమయంలో చెట్ల కింద సేద తీరుతున్నారు. ఇక్కడ ప్రయాణికులు కూర్చునేందుకు వేసిన సిమెంట్ బెంచీలు కూడా ఎండలోనే ఉండటం గమనార్హం. అధికారులు స్పందించి ముఖ్యమైన కూడలిలో బస్‌షెల్టర్ నిర్మించాలని ఆనందపురం, పద్మనాభం మండల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, రైతులు కోరుతున్నారు.